
సాక్షి
అనంతపురం
బుధవారం । 6 । డిసెంబర్ । 2023



## తేలికపాటి వర్షసూచన

తుపాను ప్రభావంతో రాగల నాలుగు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.



## టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.6°/20.8°

జిల్లా అంతటా మంగళవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం చలి కొనసాగింది.

## న్యూస్‌రీల్

### ఒత్తిళ్లకు తలొగ్గకండి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి

**అనంతపురం అర్బన్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ క్లెయిమ్‌లు, దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి ఒత్తిళ్లకూ తలొగ్గవద్దని కలెక్టర్ గౌతమి అధికారులు, బీఎల్‌ఓలను ఆదేశించారు. తప్పులు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, ఎలక్షన్ డీటీలు, ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలపై బీఎల్‌ఓలకు, ఏఈఆర్‌ఓలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. క్లెయిమ్‌ల పరిష్కారంలో స్పష్టత లేకపోతే సొంత నిర్ణయం తీసుకోకుండా ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఫిర్యాదు, దరఖాస్తును పక్కాగా విచారణ చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. ఇంటింటి క్యాంపెయిన్, డ్రాఫ్ట్ పబ్లికేషన్, క్లెయిమ్‌లకు సంబంధించి తొలగింపుల విషయంలో బాగా పనిచేశారంటూ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ముఖ్యంగా గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం నియోజకవర్గాల ఈఆర్‌ఓలు కొత్తగా వచ్చినప్పటికీ బాగా పనిచేశారంటూ మెచ్చుకున్నారు. సమావేశంలో ఆర్డీఓ రాణీసుస్మిత, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, ఎన్నికల్ సెల్ తహసీల్దారు భాస్కర్, డీటీ కనకరాజు పాల్గొన్నారు.

### హజ్‌యాత్రకు దరఖాస్తు చేసుకోండి

**అనంతపురం కల్చరల్:** అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో హజ్‌యాత్ర చేయాలనుకునే వారు ఈ నెల 20లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హజ్ కమిటీ కన్వీనర్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. పవిత్ర హజ్‌యాత్ర చేయాలనుకునే వారి కోసం భారత హజ్ కమిటీ తన కార్యకలాపాలను ప్రకటించిందని పేర్కొన్నారు. దరఖాస్తులనుhtt//hajcommittee.gov.in వెబ్‌సైట్ ద్వారా పంపాలని, మరింత సమాచారం కోసం 94400 17720 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### నేడు అంబేడ్కర్ వర్ధంతి

**అనంతపురం రూరల్:** సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. ఉదయం 10 గంటలకు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వర్ధంతి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. విద్యార్థులు, మేధావులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

### ఓటు శక్తివంతమైన ఆయుధం



2 కె రన్‌ను ప్రారంభిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

**అనంతపురం అర్బన్:** ఓటు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ఇది దుర్వినియోగమైతే ప్రజాస్వామ్యానికి చేటుగా మారుతుందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవడమే కాక, అర్హత ఉన్న యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు సంబంధించి స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మంగళవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల వరకూ చేపట్టిన 2 కె రన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఒక మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే శక్తి ఓటుకు మాత్రమే ఉంటుందన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, డీఐపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ భరత్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, డీఎల్‌డీఓ ఓబులమ్మ, తహసీల్దారు బాలకిషన్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాధికార సంరంభం



బస్సుపై నుంచి అభివాదం చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు



రాయదుర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్రకు పోటెత్తిన జన తరంగంలో ఓ భాగం



రాయదుర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్రలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు



అశేష జనవాహిని నడుమ కొనసాగుతున్న బస్సు యాత్ర

- జగన్‌తోనే అన్ని వర్గాలకూ సంక్షేమం
- సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన జనం
- రాయదుర్గంలో ప్రతిధ్వనించిన జగన్ నినాదం
- బహిరంగ సభ సక్సెస్‌తో ప్రతిపక్ష టీడీపీలో వణుకు

**రాయదుర్గం:** బడుగు, బలహీన వర్గాల్లో సామాజిక సాధికారత వెల్లివిరిసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన సామాజిక విప్లవాన్ని వివరించే సామాజిక సాధికార యాత్రకు రాయదుర్గం వేదికైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జరిగిన మేలు, వారికి దక్కిన గౌరవం, లభించిన ప్రాధాన్యత తెలుసుకుని ఆయా వర్గాలు వైఎస్సార్‌సీపీ సర్కారుకు ఫిదా అయ్యాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బస్సు యాత్రకు నియోజకవర్గంలోని డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం మండలాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘనంగా స్వాగతం పలికారు. శాంతినగర్‌లో దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి యాత్రను ప్రారంభించారు. మంత్రులు గుమ్మనూరు జయరాం, కేవీ ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య తదితరులపై జనం పూల వర్షం కురిపించగా.. మహిళలు హారతులు పట్టారు. రహదారులన్నీ జనంతో నిండిపోయాయి. విప్ కాపు తనయుడు, యువనేత కాపు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ ఆకట్టుకుంది. 4.30 గంటలకు తేరుబజారులోని బహిరంగ సభా వేదిక వద్దకు ముఖ్య అతిథులు చేరుకున్నారు.

### సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

ప్రజా సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని మంత్రులు గుమ్మనూరు జయరాం, కె.వి.ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని సామాజిక వర్గాలకూ సముచిత ప్రాధాన్యం కల్పించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఇలాంటి సభలు గర్వంగా నిర్వహించుకుంటున్నామంటే అది జగన్ పుణ్యమేనని గుర్తుచేశారు. అశేష జనవాహిని తరలివచ్చి సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయడంతో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో వణుకు పుట్టిందన్నారు. అధికారం కోసం మోసపూరిత వాగ్దానాలతో మీ ముందుకు వచ్చే చంద్రబాబు, టీడీపీ నేతలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు, పాలనలో పారదర్శకత, రాజకీయాల్లో విలువలు పాటిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీని మరోమారు అధికారంలోకి తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్ పాల్గొన్నారు. వీరితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, టీటీడీ బోర్డు మెంబర్ అశ్వత్థనాయక్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు వన్నూర్‌స్వామి, వాల్మీకి రామాంజినేయులు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఐదు మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి



వైఎస్ జగన్ పాలనలో కనీవినీ ఎరుగని రీతిలో రాయదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది. అంతే కాదు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 2,54,928 మంది లబ్ధిదారులకు రూ.1,600 కోట్లు ఖర్చుచేశాం. పల్లెలకు సైతం రోడ్లు వేయించి రాకపోకలు సాఫీ చేశాం. రూ.42 కోట్లు మంజూరు చేసి పట్టణ ప్రజలకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా దాహార్తి తీర్చాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం జగన్ రాజ్యాధికారం కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన బడుగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామాజిక యాత్రకు బ్రహ్మరథం పట్టారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలి. టీడీపీ హయాంలో కాలవ శ్రీనివాసులు ఇసుక, మట్టి, నీరు–చెట్టు, రెయిన్ గన్ల ద్వారా రూ.300 కోట్లకు పైగా ప్రజాధనం కొల్లగొట్టారు. ఊరూరా బెల్టు షాపులు పెట్టించి కమీషన్లు దండుకున్నారు. పేకాట కేంద్రాలు, క్లబ్బులు, బెట్టింగులు ప్రోత్సహించారు. నాడు సంక్షేమ పథకాలను జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారికే ఏకపక్షంగా కట్టబెట్టి.. ఎంతో మంది అర్హులకు మొండిచేయి చూపించారు. తప్పుడు హామీలతో మీ ముందుకు వచ్చే టీడీపీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలి. జగన్ సీఎంగా ఉంటేనే పేదల సంక్షేమం, బిడ్డల భవిష్యత్తు సాధ్యమవుతుంది.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

### సాధికారతకు పెద్దపీట



సామాజిక సాధికారతకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారు. సమాజంలో అట్టడుగు వర్గాల గౌరవ మర్యాదలు పెంచారు. కులం, మతం, పార్టీలు ఇలా ఏవీ చూడకుండా సంక్షేమ పథకాలు అందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 80 శాతం పదవులు దక్కాయంటే అది జగన్ చూపిన సాధికారత. గడిచిన నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. వచ్చే ఎన్నికల్లో పేదలంతా ఓ పక్క.. పెత్తందార్లు మరో పక్క ఉంటారు. జగన్ గెలుపు రాష్ట్రానికి చాలా అవసరం. ఎన్నికల్లో ఫ్యాన్ గిర్రున తిరగాలి. – తలారి రంగయ్య, ఎంపీ

### దళితులంటే బాబుకు చులకన



టీడీపీ అధినేత చంద్రబాబుకు దళితులంటే చులకన. దళితుల్లో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అంటూ పెత్తందార్ల భావాన్ని చాటుకున్నారు. దళితుల ఓట్లు అడిగే అర్హత ఆయనకు లేదు. అతి సామన్య కుటుంబం నుంచి వచ్చిన నాకు ఇంతటి సముచిత స్థానం, గౌరవం దక్కిందంటే అతి జగన్ చూపిన సామాజిక న్యాయమే. టీడీపీ నేత కాలవ శ్రీనివాసులు రాజకీయ అవకాశ వాది. – మాల్యవంతం మంజుల, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్

### మైనార్టీల సంక్షేమానికి విశేష కృషి



మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ విశేష కృషి చేశారు. అంబేడ్కర్, జ్యోతిరావుపూలే లాంటి మహనీయులు కన్న కలలను జగన్ సాకారం చేశారు. ప్రజలందరి మతం మానవత్వమని చాటి చెప్పారు. సామాజిక సాధికార యాత్ర విజయవంతంగా సాగుతోందంటే బడుగు, బలహీన వర్గాలకు సీఎం చేసిన మేలే కారణం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవులు, ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు.

– నదీం అహమ్మద్, ఉర్దూ అకాడమీ చైర్మన్

### ప్రజా విశ్వాస యాత్ర



ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్నది వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర కాదు... ప్రజా విశ్వాస యాత్ర. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మోసం చేసిన టీడీపీపై దండయాత్ర. నాలుగున్నరేళ్లుగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం చేసిన మేలును తెలియజేయడమే యాత్ర ప్రధాన ఉద్దేశం. రాయదుర్గంలో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న టీడీపీ నేత కాలవ శ్రీనివాసులును 2024లో చిత్తుగా ఓడించాలి.

– పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు









వైనాట్ 175 ప్లకార్డు ప్రదర్శిస్తున్న యువకుడు  సామాజిక సాధికార యాత్రలో జెండాలు చేబూని అభిమానుల కేరింత

# అర్హులందరికీ రుణాల మంజూరు

- అలసత్వం వీడకపోతే చర్యలు
- బ్యాంకర్లకు కలెక్టర్ గౌతమి హెచ్చరిక
- కేంద్ర, రాష్ట్ర పథకాలపై విస్తృత ప్రచారం అవసరం
- ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికి ఆదేశం



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

**అనంతపురం సిటీ:** అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ గౌతమి బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లా పరిషత్‌లోని డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) సమావేశాల్లో కలెక్టర్ మాట్లాడారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్ల అలసత్వం వహించడాన్ని తీవ్రంగా పరిగణించారు. అలసత్వాన్ని వీడి లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కింద జిల్లాకు 246 యూనిట్లు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 181 యూనిట్లకు మాత్రమే రుణాలు పంపిణీ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టాండప్ ఇండియా పథకానికి సంబంధించి పూర్తిస్థాయి లక్ష్యం సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. వీవర్స్ ముద్రా పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1,180 మందికి గాను ఇప్పటి వరకు 421 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారందరికీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజస్ (పీఎంఎఫ్ఎంఈ) కింద 310 యూనిట్లు మంజూరు చేయాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 88 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఇలాగైతే లక్ష్యాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. పీఎం ముద్రా పథకం కింద శిశు, కిశోర్, తరుణ్ రుణాలను గత ఏడాది కంటే ఈ ఏడాది తక్కువగా మంజూరు చేయడంపై కలెక్టర్ బ్యాంకర్లను నిలదీశారు. ఏసీపీ 2023–24 యాక్షన్ ప్లాన్ ప్రకారం ఇప్పటి వరకు 73.37 శాతం రుణాల పంపిణీ పూర్తయిందని, నెలాఖరు నాటికి వంద శాతం రుణాల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీసీఆర్‌సీ కార్డు కలిగిన రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. ఈ విషయంలో అధికారులు, బ్యాంకర్లు పరస్పర సహకారం, సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన పథకాల మంజూరులో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై ఆయా వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఐపీ అధ్యక్షుడు గోపాల్, ఆర్‌బీఐ ఎల్‌డీఎం అనిల్‌కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యరాజ్, నాబార్డు ఎల్‌డీఎం అనూరాధ, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నాగరాజు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం టౌన్:** రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి ఎంఎస్ఎంఈ పార్క్‌లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు దరఖాస్తు చేసుకుంటే స్థలాలు కేటాయించనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50ఎకరాల విస్తీర్ణం కలిగిన ఇండస్ట్రియల్ పార్క్‌లో ఇప్పటికే 60 శాతానికి పైగా స్థలాలను పారిశ్రామిక వేత్తలకు కేటాయించినట్లు వెల్లడించారు. మిగిలిన 40శాతం స్థలాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువ పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు అందించనున్నట్లు తెలిపారు.

**కూడేరులో అతిపెద్ద ఇండస్ట్రియల్ పార్క్ :** కూడేరు మండల కేంద్రానికి సమీపంలో అతిపెద్ద ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కానుంది. ఇప్పటికే ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా 376 ఎకరాల భూమి సేకరించారు. మరో వారం రోజుల్లో పరిపాలన అనుమతులు రానున్నాయి.

## క్లుప్తంగా

### రేషన్ దుకాణం సీజ్



సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఉరవకొండ: స్థానిక 12వ రేషన్ దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో రంగా వీధిలోని 12వ రేషన్ దుకాణం డీలరు గత మూడు నెలలుగా ప్రజలకు బియ్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. పంపిణీ చేయకుండా నిల్వ ఉంచిన బియ్యం, ఇతర నిత్యావసరాలను స్వాధీనం చేసుకుని, దుకాణాన్ని సీజ్ చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు శేషగిరి, రవీంద్ర, సీఎస్‌డీటీ కంబక్క, కానిస్టేబుల్ వీరయ్య పాల్గొన్నారు.

### రెండో ఆదివారమే అనుమతించండి



విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మహేశ్వరమ్మ

యాడికి: కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులను కలిసేందుకు వచ్చే తల్లిదండ్రులను కేవలం రెండో ఆదివారం మాత్రమే అనుమతించాలని ప్రత్యేకాధికారిని జీసీడీఓ మహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక ఎంఈఓ కాశెప్పతో కలసి మంగళవారం యాడికిలోని కేజీబీవీని ఆమె సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. వసతులపై ప్రత్యేకాధికారి నిర్మలతో ఆరా తీశారు. ప్రతి తరగతి గదికి వెళ్లి అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరు, పౌష్టికాహారం, వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం కేజీబీవీ కమిటీ చైర్మన్ తులసి, ఎస్‌ఓ నిర్మల, వేములపాడు గ్రామ సర్పంచ్ ఓంకారమ్మ, విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. పిల్లలను పలకరించేందుకు ఆదివారం వస్తుంటే ఎస్‌ఓ అనుమతించడం లేదంటూ ఈ సందర్భంగా తల్లిదండ్రులు వాపోయారు. దీంతో కేజీబీవీ నిబంధనలపై తల్లిదండ్రులకు ఆమె అవగాహన కల్పించారు. రెండో ఆదివారం మాత్రమే తల్లిదండ్రులను అనుమతించాలని, పిల్లలను బయటకు పిలుచుకెళ్లాల్సి వస్తే ఎస్‌ఓ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, సీఆర్‌పీ నరేంద్రబాబు పాల్గొన్నారు.

# ఎస్కేయూ ప్రగతికి భరూసా

- ఇప్పటికే రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ కింద రూ. 20 కోట్ల నిధులు
- మరమ్మతులు, క్యాంపస్ సుందరీకరణకు వెచ్చింపు
- నూతనంగా రెండు హాస్టళ్ల నిర్మాణం
- మరో దఫా నిధులు వచ్చే అవకాశం
- కొత్త పరికరాల ఏర్పాటు, డిజిటల్ తరగతుల నిర్మాణం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పురోగతికి రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (రూసా) పథకం దన్నుగా నిలిచింది. నాణ్యమైన పరిశోధన, బోధనాభ్యసన పెంపుదల, ఉత్తమ ఆవిష్కరణలు దోహదం చేయడానికి వీలుగా రూసా పథకం కింద న్యాక్ గ్రేడింగ్‌ను బట్టి కేంద్ర ప్రభుత్వం 60 శాతం , రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాతో నిధులు జమ చేస్తాయి. ఈ క్రమంలో ఇప్పటికే ఎస్కేయూకు రూ.20 కోట్ల మేర నిధులు మంజూరు కాగా, నాలుగు రకాల మౌలిక వసతుల మెరుగుకు వినియోగించారు. ఇప్పటి వరకూ రూ.14 కోట్లు వ్యయం కాగా, మరో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ మొత్తానికి సంబంధించి వినియోగితా పత్రాలు (యూటిలైజేషన్ సర్టిఫికెట్స్) అందజేస్తే మరో దఫా నిధులు మంజూరు కానున్నాయి. న్యాక్‌లో ఏ గ్రేడ్ దక్కితే రూ.40 కోట్లు, బీ గ్రేడ్ దక్కితే రూ.20 కోట్లు రానున్నాయి. ఈ మొత్తాన్ని రాబోవు ఐదేళ్లలో వర్సిటీలో అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉంటుంది.

**అందుబాటులోకి నూతన భవనాలు**

ఇప్పటికే అందిన రూసా నిధులతో క్యాంపస్‌లో నూతనంగా సరస్వతి ఉమెన్స్ హాస్టల్, మెన్స్ హాస్టల్‌ను నిర్మించారు. 50 గదులు కలిగిన ఉమెన్స్ హాస్టల్‌కు రూ. 3.25 కోట్లు, మెన్స్ హాస్టల్‌కు రూ.3.25 కోట్లు ఖర్చు చేశారు. అకడమిక్ భవనంలో టాయిలెట్ బ్లాక్స్ ఏర్పాటుకు రూ.50 లక్షలు ఖర్చు చేశారు. మొత్తం నూతన నిర్మాణాలకు రూ.7 కోట్లు వెచ్చించారు. నీటి నిల్వకు కొత్త సంపుల ఏర్పాటుకు రూ.53.50 లక్షలు, పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 48 లక్షలు కేటాయించారు. డ్రైనేజీ, స్వీజ్ లైన్స్ పనులకు రూ.1.21 కోట్లు, ఆల్టర్నేటివ్ ఎనర్జీ రీసోర్సెస్‌కు రూ.1.45 కోట్లు, క్యాంపస్ సుందరీకరణకు రూ.40 లక్షలు, లైబ్రరీ భవన మరమ్మతులకు రూ.50 లక్షలు, 7 హాస్టళ్లలో మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.1.59 కోట్లు, ల్యాబొరేటరీల మరమ్మతులకు రూ.43 లక్షలు ఖర్చు చేశారు.

**చేపట్టబోయే పనుల వివరాలు**

| పని | వెచ్చించనున్న నిధులు |
|---|---|
| మొబైల్ ల్యాబొరేటరీ స్టూడెంట్స్ ఫీల్డ్‌విజిట్ | రూ.1 కోటి |
| మాయిచుర్ కంటెంట్ ఇన్‌సాయిల్ | రూ.25లక్షలు |
| స్పెసిఫిక్ ఐఓఎన్ ఎలక్ట్రోమీటర్ | రూ.10 లక్షలు |
| డిజిటలైజేషన్ వర్క్ ఇన్ లైబ్రరీ | రూ.21.83 లక్షలు |
| క్యాంపస్ నెట్‌వర్క్ | రూ.8.80 లక్షలు |
| వైఫై ఫెసిలిటీ | రూ.31.22 లక్షలు |
| సెంట్రల్ కంప్యూటర్ ఫెసిలిటీ | రూ. 1.74 కోట్లు |
| 3 డిజిటల్ తరగతి గదులకు | రూ.80 లక్షలు |
| స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ | రూ.17.96 లక్షలు |
| మల్టీమీడియా స్టూడియో సెంటర్ | రూ.1.15 కోట్లు |

**వర్సిటీ సమగ్రాభివృద్ధికి చర్యలు**



ఎస్కేయూ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. న్యాక్‌కు సంబంధించి ఇప్పటికే ఎస్ఎస్ఆర్ (సెల్ఫ్ స్టడీ రిపోర్ట్)ను నివేదించాం. ఈ నివేదిక ఆధారంగా క్యాంపస్‌ను న్యాక్ పీర్ కమిటీ సందర్శించి గ్రేడింగ్ ఇస్తుంది. ఇందులో మెరుగైన గ్రేడింగ్ రావాలని ఆశిస్తున్నాం.

– డాక్టర్ చింతా సుధాకర్, ఇన్‌చార్జ్ వీసీ, ఎస్కేయూ

## ఘనంగా లోకో షెడ్ వజ్రోత్సవం



కేక్ కట్ చేస్తున్న పీసీఈఈ మిశ్రా, డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

గుత్తి: గుత్తి లోకో షెడ్ దినదినాభివృద్ధి చెందుతోందని దక్షిణ మధ్య రైల్వే పీసీఈఈ (పవర్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్) పీడీ మిశ్రా, గుంతకల్లు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ అన్నారు. గుత్తి లోకో షెడ్ 60వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మిశ్రా, మనీష్ అగర్వాల్ హాజరై, కేక్ కట్ చేసి మాట్లాడారు. దక్షిణ మధ్య రైల్వేలోనే గుత్తి రైల్వే లోకోషెడ్ ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ఇక్కడ కార్మికుల పనితీరు చాలా బాగుంటుందన్నారు. భవిష్యత్‌లో మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధాకర్, సూర్యనారాయణ, సికింద్రాబాద్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ మంజు లతామిశ్రా, గుంతకల్లు ఆర్గనైజేషన్ నీతి అగర్వాల్, గుత్తి ఆర్గనైజేషన్ రేవతి, గుత్తి సీనియర్ డీఎంఈ రమేష్, డీఎంఈ ప్రమోద్, ప్రియాంక, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.అనంతరం లోకో షెడ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రూ.3 కోట్లతో నూతనంగా నిర్మించిన హెచ్‌వీ ఎక్స్‌టెన్షన్, హెచ్‌వీ రిపేరి బే ను ప్రారంభించారు.

**ఉత్తమ లోకో షెడ్‌గా ఎంపిక**

ఉత్తమ లోకో షెడ్ గుత్తి ఎంపికైంది. ఈ మేరకు పీడీ మిశ్రా ప్రకటించారు. గుత్తితో పాటు విజయవాడ లోకో షెడ్ కూడా ఉత్తమ షెడ్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

## 'మలబార్' లక్ష్యంగా చోరీలు

- హైదరాబాద్ పోలీసుల అదుపులో అనంత మహిళ
- నేడో.. రేపో పీటీ వారెంట్‌పై అనంతకు

అనంతపురం క్రైం: కేవలం మలబార్ గోల్డ్ దుకాణాలే లక్ష్యంగా చేసుకుని చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్న అనంతపురానికి చెందిన ఓ మహిళను హైదరాబాద్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతపురం టూటౌన్ సీఐ శివరాములు తెలిపిన మేరకు... గత నెల 24న హైదరాబాద్‌లోని మలబార్ గోల్డ్ దుకాణానికి వెళ్లిన ఓ మహిళ బంగారు నగ కొనుగోలు చేసేలా నటిస్తూ గొలుసుకున్న 39 గ్రాముల కొక్కీను అపహరించింది. మేలిమి బంగారు కొక్కికి బదులు నకిలీ కొక్కీ తగిలించి నగ కొనకుండా వెళ్లిపోయింది. ఇదే తరహాలో నవంబర్ 29న అనంతపురంలోని మలబార్ దుకాణంలోనూ చోరీ చేసింది. కాగా, హైదరాబాద్‌లో బంగారు నగ కొనుగోలు చేసిన ఓ కస్టమర్ కొక్కీ నకిలీదని గుర్తించి నిలదీయడంతో దుకాణదారులు వెంటనే అప్రమత్తమై సీసీ ఫుటేజీలు పరిశీలించారు. దీంతో మాయలేడి బంగారు కొక్కీ మార్చే దృశ్యాలు బయటపడ్డాయి. దీంతో తమ అధీనంలోని అన్ని దుకాణాలను యాజమాన్యం అప్రమత్తం చేయడంతో పాటు మాయలేడి ఫొటోలను షేర్ చేసింది. ఈ క్రమంలో ఈ నెల 3న గుంటూరులోని మలబార్ గోల్డ్ దుకాణానికి వెళ్లిన సదరు మహిళను అక్కడి సిబ్బంది గుర్తించారు. అయితే విషయాన్ని బయట పెట్టకుండా మాటల్లో పెట్టి ఆమె ఆధార్ వివరాలు సేకరించారు. ఆమె ప్రతి కదలికపై నిఘా ఉంచడంతో కొక్కీ అపహరణకు వెనుకంజ వేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆధార్ కార్డు ఆధారంగా అనంతపురానికి చెందిన మహిళగా నిర్ధారించుకున్న యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తెలంగాణ పోలీసులు మంగళవారం అనంతపురానికి చేరుకుని అదుపులోకి తీసుకుని, హైదరాబాద్‌కు తరలించారు. కాగా, అనంతపురంలోని చోరీ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు మరో రెండు రోజుల్లో పీటీ వారెంట్‌పై ఆమెను కస్టడీకి తీసుకోనున్నట్లు సమాచారం.

## 'హంద్రీ-నీవా'లో యువతి మృతదేహం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల పరిసరాల్లో ప్రవహిస్తున్న హంద్రీ-నీవా ప్రధాన కాలువలో మంగళవారం మధ్యాహ్నం ఓ యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి, పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతురాలిని కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం గుమ్మనూరుకు చెందిన శ్యామల (22)గా గుర్తించారు. ఈ నెల 2న ఆమె అదృశ్యమైనట్లు చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిందా? లేక ఆత్మహత్య చేసుకుందా? అనే కోణంలో వజ్రకరూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## నేడు కుందుర్పిలో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: కుందుర్పిలో బుధవారం 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఉదయం 9:30 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



## నేర ప్రవృత్తి వీడితేనే అభ్యున్నతి సాధ్యం

- ఎస్పీ అన్బురాజన్



శికారీ కుటుంబాలతో ఎస్పీ అన్బురాజన్, విశాల ఫెర్రర్, తదితరులు

అనంతపురం క్రైం: నేర ప్రవృత్తిని వీడి పరివర్తన దిశగా అడుగు వేస్తేనే జీవితాలకు పరమార్థం ఉంటుందని శికారీలకు ఎస్పీ అన్బురాజన్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు శాఖ, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో కొందరు మానవతావాదులు అనంతపురంలోని శికారీ కాలనీలో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎస్పీ అన్బురాజన్, ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. విద్యతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ క్రమంలో పిల్లలను చదివించేందుకు ముందుకు రావాలని శికారీలకు పిలుపునిచ్చారు. ఇందుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గతంలో నేర ప్రవృత్తితో తప్పటడుగులు వేసి, పరివర్తనతో సమాజంలో గౌరవ మర్యాదలు సంపాదించుకున్న వ్యక్తుల జీవన విధానాలను వివరించారు. అనంతరం 80 మంది పిల్లలకు సబ్బులు, బ్రష్, పేస్ట్, ఆయిల్ కిట్లను అందజేశారు. ఆర్డీటీ వైద్య బృందం మెడికల్ క్యాంప్ నిర్వహించి, దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు ఉచితంగా చికిత్సలు చేశారు. దాతల సహకారంతో 135 మంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జత దుస్తులు, స్వెట్టర్లు అందజేశారు. మగ వారికి షర్టు, లుంగీ, స్త్రీలకు చీరలు పంపిణీ చేశారు. రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలో ఉన్న మాంటిస్సోరి ఫౌండర్ భరత్ తన వంతుగా కాలనీ విద్యార్థులకు 2 కంప్యూటర్లు, 1 ప్రొజెక్టర్ అందజేశారు. కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి మీనాక్షమ్మ ఐ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆపరేషన్ చేయిస్తామని ఆ సంస్థ నిర్వాహకుడు రమణ హామీ ఇచ్చారు. రాప్తాడు ఎస్సీ సంఘం వారు కాలనీలోని 20 కుటుంబాలకు 6 నెలల సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి, అనంతపురం డీఎస్పీ ప్రసాదరెడ్డి, ఆర్డీటీ డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, రఫీ, వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి, దాతలు తాడిపత్రి రవి ప్రకాష్, బాబ్జాన్, భరత్, రమణ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పాటిల్ సుధాది ఆత్మహత్యే



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఆంథోనప్ప

అనంతపురం క్రైం: కుటుంబసభ్యులు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు నచ్చక పాటిల్ సుధ ఆత్మహత్యకు పాల్పడిందని ప్రత్యేక దర్యాప్తు అధికారి, దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆంథోనప్ప స్పష్టం చేశారు. ఈ నెల 1న అనంతపురంలోని నలందా విద్యాసంస్థకు చెందిన హాస్టల్ భవనంపై నుంచి సుధ కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలిసిందే. ఘటనపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తును ఆంథోనప్ప చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నగర డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ ధరణీకిషోర్‌తో ఆయన కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆత్మహత్యకు ముందు తన స్నేహితులతో చాలా సేపు మాట్లాడిందన్నారు. తల్లిదండ్రులతో పాటు కుటుంబ పెద్దలు తీసుకుంటున్న నిర్ణయాలు తనకు ఇబ్బందికరంగా మారాయని బాధపడిందన్నారు. ఈ క్రమంలోనే మానసిక సంఘర్షణకు లోనైన ఆమె అర్ధంతరంగా తనువు చాలించిందన్నారు.

## బంగారు నగల అప్పగింత



బ్యాగులో ఉన్న బంగారు నగలు చూపుతున్న నరేష్

ముదిగుబ్బ: బస్సులో ప్రయాణిస్తూ విలువైన బంగారు నగలున్న బ్యాగ్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి పోలీసులు సకాలంలో సొత్తును స్వాధీనం చేసుకుని అందజేశారు. వివరాలు... కదిరి నుంచి అనంతపురానికి వెళుతున్న ఆర్టీసీ బస్సులో మంగళవారం అనంతపురానికి చెందిన నరేష్, తన కుటుంబసభ్యులతో కలసి ప్రయాణిస్తున్నాడు. బస్సు ముదిగుబ్బకు చేరుకోగానే ఆ గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు దిగారు. ఆ సమయంలో పొరబాటున తమ బ్యాగ్ కాకుండా నరేష్ బ్యాగ్ తీసుకెళ్లారు. బస్సు అనంతపురానికి చేరుకున్న తర్వాత తన బ్యాగ్ కనిపించక పోవడంతో వెంటనే డయల్ 100కు నరేష్ ఫోన్ చేశాడు. స్పందించిన పోలీసులు వెంటనే ముదిగుబ్బలో దిగిన వారిని విచారించారు. అప్పటి వరకూ తమ వద్ద ఉన్న బ్యాగ్‌ను సక్రమంగా చూసుకోని వారు జరిగిన పొరపాటుపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ వెంటనే పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న నరేష్ వెంటనే ముదిగుబ్బకు చేరుకుని బ్యాగ్‌ను పరిశీలించాడు. అందులో తాను ఉంచిన రూ.50 వేలు విలువ చేసే బంగారు నగలు భద్రంగా ఉండడంతో పోలీసులకు, ముస్లిం సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ – ఒకరి మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



మృతుడు మస్తాన్

గుంతకల్లు టౌన్: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన బేల్దారి మస్తాన్ (27) గుంతకల్లులోని సీపీటీయూ కాలనీకి చెందిన షబానాను రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలను ఉన్నారు. ఆరు రోజుల క్రితం మూడో కాన్పు కింద ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో తన బిడ్డను చూసేందుకు వచ్చిన మస్తాన్ మంగళవారం రాత్రి అదే కాలనీకి చెందిన వంశితో కలసి ద్విచక్ర వాహనంపై బజారు నుంచి ఇంటికి వెళుతుండగా ఆలూరు రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే బీరప్ప సర్కిల్ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో మస్తాన్, వంశితో పాటు మరో బైక్‌పై ఉన్న నారాయణ, శర్మస్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మస్తాన్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శర్మస్‌ను కర్నూలుకు, నారాయణస్వామిని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

## ఏడు మండలాల్లో వాన



పుట్టపర్తి శివారులో కురుస్తున్న చిరుజల్లులు

పుట్టపర్తి అర్బన్: మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం వరకూ శ్రీసత్యసాయి జిల్లాలోని ఏడు మండలాల్లో వర్షం కురిసింది. ఎన్‌పీ కుంటలో అత్యధికంగా 53.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక తలుపుల 24.2, తనకల్లు 12.6, ఓడీసీ 9.2, నల్లచెరువు 8.4, గాండ్లపెంట 7.8, అమడగూరు 2.4 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

### రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ శోభారాణి

కణేకల్లు: నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లను జిల్లా పౌరసరఫరాల అధికారి శోభారాణి ఆదేశించారు. కణేకల్లులోని 21వ ఎఫ్‌పీ షాపును మంగళవారం ఆమె పరిశీలించారు. తూకాల్లో తేడాలపై లబ్ధిదారులతో ఆరా తీశారు. అనంతరం దేవమ్మగుడి వీధిలో ఎండీయూ–10 ద్వారా చేపట్టిన డోర్ టు డోర్ బియ్యం పంపిణీని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా ప్రతి ఇంటి వద్దకెళ్లి సరుకులు పంపిణీ చేయాలని ఎండీయూ ఆపరేటర్‌ను ఆదేశించారు. అనంతరం పోర్టిఫైడ్ బియ్యంలోని పోషకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె వెంట వీఆర్వో ప్రదీప్ ఉన్నారు.

### ధర్మవరం నుంచి పుట్టపర్తికి అదనపు బస్సులు

పుట్టపర్తి టౌన్: రైళ్ల రద్దు నేపథ్యంలో పుట్టపర్తికి వచ్చే సందర్శకుల సౌకర్యార్థం ధర్మవరం నుంచి పుట్టపర్తికి అదనపు బస్సు సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్ తెలిపారు. బస్సు సర్వీసుల నిర్వహణ అంశంపై మంగళవారం తన చాంబర్‌లో డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ సూపరవైజర్లతో ఆయన సమీక్షించారు. ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ – కొత్తచెరువు మధ్యన ఉన్న నల్లకొండలో 234 మీటర్ల పొడవైన రైల్వే సొరంగ మార్గంలో పైనుంచి రాళ్లు, మట్టి పట్టాల పైకి రాలుతోందన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన రైల్వే అధికారులు ఈ నెల 8 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకూ దాదాపు 63 రోజుల పాటు మరమ్మతు పనులు చేపట్టనున్నారన్నారు. దీంతో ఈ మార్గంలో సంచరించే 22 రైళ్ల రాకపోకలను రద్దు చేయడంతో పాటు మరో 33 రైళ్లను ధర్మవరం నుంచి ఎస్ఎస్ గేట్ మీదుగా పెనుకొండ వైపు మళ్లిస్తున్నారన్నారు. దీంతో పుట్టపర్తికి రైలు మార్గంలో చేరుకునే ప్రయాణికులు ధర్మవరం మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుందని, ఈ క్రమంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 25 అదనపు బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

### ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌తో సైబర్ నేరాలకు చెక్

అనంతపురం క్రైం: నేషనల్ క్రైం రికార్డు బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) పోర్టల్ ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చునని జిల్లా వాసులకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. తాజాగా గుత్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ మూడు నెలల వ్యవధిలో 50 మంది బ్యాంక్ ఖాతాదారులను సైబర్ నేరగాళ్లు మోసగించి ఖాతాల్లోని నగదును అపహరించగా... బాధితులు వెంటనే ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారని, ఈ కేసులను సవాల్‌గా తీసుకుని 19 మంది బాధితులకు సత్వర న్యాయం చేకూర్చినట్లు వివరించారు. మిగిలిన కేసుల్లో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. సైబర్ వలలో పడకుండా జాగ్రత్త పడాలన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, వేలి ముద్రల్లాంటి వ్యక్తిగత సమాచారం ఇతరులకు ఇవ్వకూడదన్నారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ కార్డు నంబర్‌ను అనుసంధానం చేసి ఉండడం వల్ల అపరిచిత వ్యక్తులు అడిగితే ఆధార్ నంబర్ కాకుండా ఇతర ఐడీ నంబర్లను తెలపాలన్నారు. తరచుగా బ్యాంక్ ఖాతాలోని నగదు నిల్వను పరిశీలిస్తుండాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే వెంటనే cybercrime.gov.in లేదా 1930కు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఖాద్రీ ఆలయ ఆదాయ వనరులకు బహిరంగ వేలం

కదిరి టౌన్: ప్రఖ్యాతి గాంచిన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆదాయ వనరులపై ఏడాది పాటు హక్కు కోసం ఈ నెల 13న ఉదయం 10.30 గంటలకు వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తలనీలాలు వేలంలో పాల్గొనేవారు రూ 30 లక్షలు, విద్యుత్ సామగ్రి సరఫరాకు రూ.25 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చు. వేలం దక్కించుకున్న వారు వెంటనే మొత్తం నగదు చెల్లించాల్సి ఉంటుంది.

### దోమకాటు వ్యాధులు ప్రబలకుండా చూడండి

- జిల్లా మలేరియా అధికారి ఓబులు



మాట్లాడుతున్న డాక్టర్ ఓబులు

అనంతపురం మెడికల్: జిల్లాలో దోమకాటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా మలేరియా అధికారి ఓబులు ఆదేశించారు. దోమకాటు వ్యాధుల నియంత్రణ అంశంపై జిల్లా వైద్యఆరోగ్య శాఖ మలేరియా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా సబ్ యూనిట్ అధికారులతో ఆయన సమీక్షించారు. తుపాను ప్రభావంతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని, ఈ క్రమంలో దోమలు ప్రబలకుండా ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఇందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ల్యాబ్‌లలో రక్తపూతల సేకరణ తీరు, రికార్డులను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో ఉభయ జిల్లాల సహాయ మలేరియా అధికారులు సత్యనారాయణ, లక్ష్మీనాయక్, విస్తరణాధికారులు గిరిధర్ రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు వరించిన ధర

- క్వింటా బియ్యం రూ.5 వేలకు పైమాటే
- పెరుగుతున్న వరి సాగు విస్తీర్ణం
- వరి గ్రాసానికి పెరిగిన డిమాండ్

**ఆత్మకూరు:** ఈ ఏడాది రైతులకు ధర 'వరి'ంచింది. కొన్నేళ్లపాటు రైతులు వరి పంట సాగువైపు ఆసక్తిచూపేవారు కాదు.. నాలుగేళ్లుగా సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వం కూడా వరికి మద్దతు ధర పెంచడంతో రైతులు వరిసాగుకు మొగ్గుచూపుతున్నారు. బియ్యం ధరలు కూడా ఏటేటా అమాంతం పెరుగుతున్నాయి. మండలంలో ఆత్మకూరు, మదిగుబ్బ, తలుపూరు, పి.యాలేరు. బి.యాలేరు గొరిదిండ్ల, సనప, తోపుదుర్తి గ్రామాల్లో అధికంగా రైతులు వరి సాగు చేస్తారు. ప్రస్తుతం కాలువలకు నీరు రావడంతో బోరుబావుల్లో ఎక్కడ చూసినా నీరు సమృద్ధిగా వస్తోంది. రైతులు పంటలు పండించుకునేందుకు డోకాలేదు. దీంతో రైతులు మళ్లీ వ్యవసాయం వైపు మక్కువ చూపుతున్నారు. గత ఏడాది 250 ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు, ఈ ఏడాది 350 ఎకరాల వరకు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో చాలా మంది రైతులు వరి పంటను అధికంగా సాగు చేశారు. ఒక ఎకరం వరి సాగు చేయడానికి రైతులకు (వరి నాటడం, కలుపుతీయడం, వరి కోతకోయడం, మిషన్‌కు వేయడం ఇలా) రూ.25 వేల వరకు ఖర్చు అవుతోంది. సోనామసూరాలు, బీపీటీ రకం బియ్యం దాదాపు నాలుగు నుంచి ఆరు నెలలకు పంట చేతికి వస్తుంది. ఒక ఎకరా వరికి దాదాపు 30 బస్తాల వరకు పంట దిగుబడి వస్తుంది.


వరి పైర్లు


వరి ధాన్యం రాసికి పూజ చేసిన దృశ్యం

**క్వింటా బియ్యం రూ. 5 వేలకు పైమాటే.. :**
ప్రస్తుతం మార్కెట్‌లో సోనా మసూరా, బీపీటీ వంటి బియ్యం క్వింటా ధర రూ.5 వేలకు పైగా పలుకుతోంది. అంతేకాకుండా గత ఏడాది, రెండేళ్ల క్రితం వరకు ఉన్న బియ్యం ( పాత బియ్యం) అయితే క్వింటా ధర రూ.5,500 లకు పైగానే మార్కెట్లో పలుకుతోంది. మండల ప్రజలు కణేకల్లు మండలానికి వెళ్లి బియ్యం కొనుగోలు చేసి వస్తుంటారు. ప్రస్తుతం బియ్యానికి మంచి ధర ఉండటంతో చాలా మంది సామాన్య ప్రజలు రైతుల ఇళ్ల దగ్గరకు వెళ్లి బియ్యం బస్తాలను కొనుగోలు చేస్తున్నారు. మరి కొందరు బియ్యం ఆడించే రైస్ మిల్లు వద్దకు వెళ్లి రైతుల వద్దనే కొనుగోలు చేస్తున్నారు. చాలా వరకు అనంతపురం, కర్ణాటక నుంచి వ్యాపారుల దగ్గరకే వచ్చి బియ్యం బస్తాలు కొనుగోలు చేస్తున్నారు.

**పెరిగిన గ్రాసం ధరలు :**
వరి కోసిన తరువాత చాలా మంది రైతులు తమకు ఉన్న పశువులకు సంబంధించి కొంత మేరకు వరిగడ్డి ఉంచుకొని మిగిలిన గ్రాసాన్ని విక్రయిస్తారు. దీంతో చాలా మంది వ్యాపారులు రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన వరి గడ్డిని ట్రాక్టర్ వరి గడ్డి రూ.10 వేలకు పైగా ధర పలుకుతోంది.

## క్లుప్తంగా

### ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘునాథ్

**ఆత్మకూరు:** ప్రభుత్వం బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీల కులగణన సర్వే చేపట్టింది. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ షర్మిల, ఎంపీపీ హేమలత ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి ఈ నెలాఖరు వరకు సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు తెలుసుకొని వలంటీర్ల లాగ్‌ఇన్‌లో వేలిముద్రలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### చట్టాలపై విద్యార్థులకు అవగాహన

**అనంతపురం క్రైం:** జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు పోలీసులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో ప్రతి స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పోలీసులు పలు అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధం, మాదక ద్రవ్యాలు, వాటిని వినియోగంతో ఎదురయ్యే పర్యవసనాలు, బాల్య వివాహాల చట్టం, దిశ యాప్, సైబర్ నేరాలు, డయల్-100, రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలులాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై వివరించారు. మానసికంగా ఎంత ధృడంగా ఉంటే అంత ఉన్నత స్థానానికి చేరుకుంటాని తెలిపారు. మంచి ఆహారం, అలవాట్లు, స్నేహాల వల్ల జీవితంలో ఒడిదుడుకులు ఉండవన్నారు. విద్యార్థి దశ నుంచే వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

### చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

**రాప్తాడు:** యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోషల్ మీడియాపై ప్రేరణ (మోటివేషన్)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజంలో యువత, విద్యార్థులు మొబైల్ ఫోన్ల ద్వారా సోషల్ మీడియాలో యూట్యూబ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియని వ్యక్తుల ట్రాప్‌లో పడొద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన సలహాలు, సూచనలు పాటించాలన్నారు. హెచ్ఎం నరసింహులు మాట్లాడుతూ సమాజంలో ఉన్న వ్యతిరేక పరిస్థితులను తట్టుకొని వాటి మాయలో పడకుండా యువత, విద్యార్థులు మంచి మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ కేశవ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### 24న ఎంహెచ్‌పీఎస్ మహాసభ


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్:** రాయలసీమ మాదిగల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న మహాసభ ఉంటుందని ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పసులూరి ఓబిలేసు తెలిపారు. మంగళవారం ఆయన సంఘం కార్యాలయంలో మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఓబిలేసు మాట్లాడుతూ మాదిగల హక్కుల పరిరక్షణే తమ ధ్యేయమన్నారు. ఈ నెల 24న నగరంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో నిర్వహించనున్న సభలో మాదిగల సమస్యలు, హక్కులపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ నాయకులు వెంగళ ఆదినారాయణ, వెంకటేసులు, ఓబులప్ప, రామాంజనేయులు, కుళ్లాయప్ప, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

### హాస్టళ్లలో సదుపాయాలు


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్‌లోని ఎల్లోరా, శిల్పా, హంపీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో వీసీ అధ్యక్షతన రెండో ఫైనాన్స్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన పనులు నిర్వహించడానికి త్వరలోనే ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, పాలక మండలి సభ్యులు డాక్టర్ డి. హరిశ్చంద్ర రామ, ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, అంజలి జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా ప్రకటన బోర్డుల ఏర్పాటు

- నిద్రమత్తులో టౌన్ ప్లానింగ్ విభాగం
- నగరపాలక సంస్థ ఆదాయానికి గండి

**అనంతపురం కార్పొరేషన్:** ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వ్యాపారులకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మారుతీనగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా గ్యాస్ డీ కంప్రెషనింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. టౌన్ ప్లానింగ్ విభాగానికి ఎలాంటి ఫీజులు చెల్లించలేదు. దీంతో రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. అదే తరహాలోనే నగరంలో ఇష్టానుసారంగా అడ్వర్టైజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేశారన్న విమర్శలు ఉన్నాయి. నగరంలోని విద్యుత్‌నగర్ నుంచి జేఎన్‌టీయూకు వెళ్లే మార్గంలో ఓ ఏజెన్సీ నిర్వాహకుడు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశారు.

**చలానాతో సరిపెట్టారు..**
వాస్తవంగా అడ్వర్టైజ్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసుకోవాలంటే నగరపాలక సంస్థ అధికారులు టెండర్లు ఆహ్వానించాలి. అనంతరం అత్యధికంగా కోట్ చేసిన వారికి అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలి. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితులు లేవు. కాలం చెల్లిన నాటి పద్ధతులను అధికారులు కొనసాగిస్తున్నారు. ఒక్కో బోర్డుకు రూ.5 వేలు (ఏడాదికి) చొప్పున చలానా కట్టి, అధికారులు అనుమతులకు సంబంధించిన ఉత్తర్వులు ఇవ్వకముందే బోర్డులను ఏర్పాటు చేసేశారు. ఇలా నగరంలోని వివిధ డివిజన్లలో 170కిపైగా బోర్డులను ఏర్పాటు చేశారు. కమిషనర్ భాగ్యలక్ష్మి ఇలాంటి వాటిపై దృష్టి సారించలేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంపైనా అధికారులు దృష్టిసారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. టెండర్ పద్ధతి ప్రకారం అడ్వర్టైజ్‌మెంట్ కేటాయింపులు చేస్తే నగరపాలక సంస్థకు భారీగా ఆదాయం సమకూరుతుంది. కానీ అధికారులు పట్టించుకోలేదు.


హౌసింగ్ బోర్డులో నిబంధనలకు విరుద్ధంగా ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసిన దృశ్యం

## హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న మేయర్ వసీం తదితరులు

**అనంతపురం కల్చరల్:** అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో హజ్‌యాత్రకు వెళ్లాలనుకునేవారు ఈనెల 20లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నగర మేయర్ వసీం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో వివరాలు తెలియజేశారు. పవిత్ర హజ్ యాత్ర చేయాలనుకునే వారిపై భారత హజ్ కమిటీ తన కార్యకలాపాలను ప్రకటించిందన్నారు. దరఖాస్తులను htt//hajcommittee.gov.in వెబ్‌సైట్ ద్వారా పంపాలన్నారు. యాత్రికుల పాస్‌పోర్టు వ్యాలిడిటీ 2025 జనవరి 31 వరకు ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హజ్ యాత్రికులకు ప్రత్యేకంగా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రం నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికుల కోసం రూ. 14.51 కోట్ల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫైక్ జావీద్, లక్ష్మీనగర్ ఖాజా పాల్గొన్నారు.

## దేశానికే ఆదర్శం 'ఆడుదాం ఆంధ్ర'

**అనంతపురం కార్పొరేషన్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దేశానికే ఆదర్శమని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో క్రీడా సామగ్రిని సచివాలయ సిబ్బందికి మేయర్ అందజేశారు. మేయర్ మాట్లాడుతూ యువత శారీరకంగా దృఢంగా ఉండేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. యువత ఆటలు ఆడి ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్ష అని అన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాంశాల్లో పోటీలుంటాయన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు టోర్నమెంట్లు ఉంటాయన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి 3 కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు గురుశేఖర్‌బాబు, శ్రీనివాసులు, కమల్‌భూషణ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, నాయకులు రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందికి క్రీడా కిట్లు అందిస్తున్న మేయర్ వసీం

**ఆటవిడుపు:** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు.

## ఒకటో ప్లాట్‌ఫారంపై నుంచి రైళ్ల రాకపోకలు

**అనంతపురం సిటీ:** అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి రైళ్ల రాకపోకలను ఎట్టకేలకు అనుమతించారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు యశ్వంతపుర నుంచి కాచిగూడకు వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ అనుమతించారు. చిన్న పనుల పెండింగ్ వల్ల ఇన్నాళ్లూ రైళ్లను మొదటి ప్లాట్‌ఫారంపైకి అనుమతించలేదు. రైల్వే స్టేషన్ విస్తరణలో భాగంగా మార్పులు చేసిన సంగతి తెలిసిందే. అన్ని రకాల కార్యాలయాలను ఒకటో ప్లాట్ ఫాం వైపు కొత్తగా నిర్మించిన భవనాల్లోకి మార్చనున్నారు. ఇప్పటికే కొన్ని విభాగాలను మార్చగా, రెండ్రోజుల్లో బుకింగ్ కార్యాలయంతో పాటు వెయిటింగ్ హాళ్లనూ అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్టేషన్ మేనేజర్ తెలిపారు. మొదటి ప్లాట్‌ఫారంపైకి గుత్తి, గుంతకల్లు వైపు వెళ్లే రైళ్ల రాకపోలను అనుమతిస్తామన్నారు. ధర్మవరం, కదిరి, హిందూపురం వైపునకు వెళ్లే రైళ్లను 3, 4 ప్లాట్ ఫారాలపై అనుమతిస్తామని తెలిపారు.

**భూగర్భ వంతెనపనులకుమార్గం సుగుమం..**
అనంతపురంలోని క్లాక్ టవర్ కూడలి సమీపంలో భూగర్భ రైలు వంతెన పనులకు మార్గం సుగమమైంది. ఫస్ట్ రోడ్డు వైపు చేపట్టిన భవన నిర్మాణాల పనుల్లో జాప్యం వల్ల రైలు పట్టాల కింద మట్టి తవ్వకాలకు సంబంధించి ఉన్నతాధికారులు అనుమతి లభించలేదు. దీంతో సుమారు నాలుగు నెలలుగా పనులు ఆగిపోయాయి. ఇప్పుడు ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపైకి రైళ్ల రాకపోకలను మంగళవారం నుంచి అనుమతించడంతో భూగర్భ వంతెన పనులకు ఇక ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చే అవకాశాలు ఉన్నాయని రైల్వే వర్గాలు తెలిపాయి. మరో నాలుగైదు రోజుల్లో పట్టాల కింద మట్టి తవ్వకం పనులు ప్రారంభించొచ్చని భావిస్తున్నారు.


ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంపైకి వందేభారత్ రైలుకు అనుమతించిన రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్

### పేరుపేరునా ధన్యవాదాలు

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**రాప్తాడురూరల్:** వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు సోమవారం రాప్తాడులో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎప్పటికీ ఆదరాభిమానాలు వైఎస్సార్‌సీపీపై చూపాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తన వంతుగా ఎప్పటికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

### వడ్డీ వ్యాపారుల హల్‌చల్

**అనంతపురం క్రైం:** నగరంలో వడ్డీ వ్యాపారులు పెట్రేగిపోతున్నారు. నగరంలోని నాయక్‌నగర్‌కు చెందిన గంగాధర్ అనే వడ్డీ వ్యాపారి అదే కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ మహిళా టీచరు ద్విచక్ర వాహనాన్ని మంగళవారం లాక్కెళ్లాడు. బాధితురాలు తన భర్తతో కలిసి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నెలకు రూ.10 వడ్డీతో రూ.లక్ష అప్పు చేశామని తెలిపింది. ప్రతి నెలా రూ. 9 వేలు వడ్డీ చెల్లిస్తున్నా అసలు ఇవ్వాలని వేధిస్తున్నారని వాపోయింది. ఉన్నఫలంగా చేతిలో డబ్బు లేక పోవడంతో ఇవ్వలేమని చెప్పిన పాపానికి స్కూల్ వద్దకు క్యారియర్ తీసుకొచ్చిన తన భర్తపై దాడి చేసి, బండి లాక్కెళ్లారని తెలిపింది. పైగా తన భర్తను చంపుతామని బెదిరించడంతో విధిలేక పోలీసులను ఆశ్రయించామని వాపోయింది. టూటౌన్ సీఐ శివరాముడు బాధితురాలి ఫిర్యాదును స్వీకరించారు. కొంత కాలంగా నాయక్ నగర్‌లో వడ్డీ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

## జీజీహెచ్‌లో ఇష్టారాజ్యంగా పార్కింగ్


అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ) ముందు అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయడంతో రోగులు, సిబ్బందికి తలనొప్పిగా మారింది. ప్రధానంగా అక్యూట్‌మెడికల్ కేర్ యూనిట్, క్యాజువాలిటీ విభాగం ఎదుట వాహనాలను ఇష్టారాజ్యంగా ఉంచుతున్నారు. ఆ ప్రాంతాల్లో వాహనాలను ఉంచరాదు. అంబులెన్సుల్లో అత్యవసర కేసులను ఆస్పత్రికి తీసుకువస్తుంటారు. క్యాజువాలిటీ వద్ద వాహనాలను విచ్చలవిడిగా నిలుపుతుండడం ఇబ్బందికరంగా ఉంటోంది. అక్యూట్ మెడికల్ కేర్ ముందు నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి. సెక్యూరిటీ సిబ్బంది వైఫల్యంతోనే వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.


క్యాజువాలిటీ ఎదుట ఉంచిన వాహనాలు

### ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీ పరిధిలోని సియేను గ్రౌండ్స్‌లో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇడుపులపాయ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం 2024 కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిషప్ ప్రభాకర్‌రెడ్డి, యేసు కృపా మందిరం పాస్టర్ నవీన్, రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిశోర్ చౌదరి, గురజాల లూక్ డేనియల్, సర్పంచ్ శివశంకర్, వెంకటరామిరెడ్డి, కిష్టఫర్, ప్రసాద్ రెడ్డి, జగమోహన్ రెడ్డి, సెలినా చౌదరి ఎస్తేర్, పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నెలకొన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం, ఎస్ఎస్‌యూఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ క్యాంపస్‌లోని మహానంది హాస్టల్ విద్యార్థులను గంగా హాస్టల్‌లోకి మార్చాలని ప్రయత్నం విరమించుకోవాలన్నారు. పీజీ ఎంట్రెన్స్ రాయని విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలన్నారు. డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల చేయకపోవడంతో పీజీ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, వాసు, శంకర్, రాము, నవీన్, శివ, నాగేంద్ర, మారెన్న, ఎస్. సురేష్, మహేష్, రవి, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు పాల్గొన్నారు.


వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి నాయకులు

## సీఎం పుట్టిన రోజు సందర్భంగా వ్యాసరచన పోటీలు

**అనంతపురం ఎడ్యుకేషన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని ' ప్రజా సంక్షేమ సంఘం' ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు 'వై నీడ్ ఏపీ జగన్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాకుడు కట్టుబడి తానీషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11న మధ్యాహ్నం 2 గంటలకు అనంతపురం నగర శివారులోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ. 5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు,తృతీయ బహుమతి రూ.2వేలు అందించనున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్ పుట్టినరోజు ఈనెల 21 కేఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ చేతులు మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

## ఫార్మసిస్టు పోస్టు భర్తీ చేయండి


డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్

**అనంతపురం మెడికల్:** జిల్లా జైలులో ఫార్మసిస్టు పోస్టును భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవిని జిల్లా జైలు సూపరింటెండెంట్ షఫీవుర్ రెహమాన్ కోరారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆయన డీఎంహెచ్ఓను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా జైలులో ఉన్న ఫార్మసిస్టు ఇటీవల మరణించగా, ప్రస్తుతం ఆపోస్టు ఖాళీ అయ్యిందన్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కడప ఆర్‌డీ పరిధిలో ఫార్మసిస్టు పోస్టుల భర్తీ ప్రక్రియ ఉంటుందని, కడప ఆర్‌డీకి రెఫర్ చేస్తామని తెలిపారు.

## నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ట


ప్రతిష్ట కానున్న నాగదేవతలు

**అనంతపురం కల్చరల్:** నగరంలోని సోమనాథ్ నగర్ కోదండ రామాలయంలో ఈనెల 6,7 తేదీల్లో ధ్వజ స్తంభ ప్రతిష్టాప నోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. అర్చకులు వేణుగోపాల కృష్ణమూర్తిస్వామి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో వివరాలు అందించారు. వేద మాత స్తూపం, నాగదేవతల ప్రతిష్టలు శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి చేతుల మీదుగా ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయన్నారు.

### కార్తీక పూజలు

**అనంతపురం కల్చరల్:** నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో కొలువైన నసన కోట ముత్యాలమ్మ ఆలయంలో కార్తీక మంగళవారాన్ని పురస్కరించుకొని కార్తీక పూజలు జరిగాయి. కార్పొరేటర్ గురుశేఖర బాబు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం అమ్మవారితో పాటు మహాశివుడికి రుద్రాభిషేకాలు, అర్చనలు చేశారు.


అలంకరణలో మహాశివుడు

## సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో నృత్య ప్రదర్శన

**ఆత్మకూరు:** పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీకమాస పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాల అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ సాయి నృత్య పద్మరాజ్ శిష్య బృందం సాంప్రదాయ కూచిపుడి నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలకు ఆలయ ఈఓ అక్కిరెడ్డి జ్ఞాపికలను అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.


కూచిపుడి నృత్య ప్రదర్శన చేసిన బాలికలను అభినందిస్తున్న ఆలయ సిబ్బంది

## ఎస్వీ డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటన

**అనంతపురం ఎడ్యుకేషన్:** నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) కమిటీ బృందం రెండు రోజుల పర్యటన మంగళవారం ముగిసింది. నాక్ పీర్ టీం సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్ అగర్వాల్, డాక్టర్ ఎం .ఖలీద్ ఆజాం, డాక్టర్ శైలజాకుమారి, ఏవీ కాంతమ్మ పర్యటించారు. ఐదేళ్లలో నిర్వహించిన కార్యక్రమాలను పీపీటీ ద్వారా కళాశాల యాజమాన్యం వివరించింది. అనంతరం బృందం సభ్యులు వివిధ విభాగాలను పరిశీలించారు. సదుపాయాలు, బోధనా పద్ధతులను అధ్యయనం చేశారు. నాణ్యత ప్రమాణాల ఆధారంగా గ్రేడును కేటాయిస్తామని సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాక్ కమిటీ సభ్యులు వివిధ అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాక్ బృందం ప్రతినిధి

### మద్యం మత్తులో అన్నావదినపై దాడి

**అనంతపురం క్రైం:** స్థానిక గుల్జార్ పేటలో మద్యం మత్తులో ఓ యువకుడు మంగళవారం అన్నా వదిన, తల్లిపై దాడి చేశాడు. బాధితులు 100కు ఫోన్ చేయడంతో బ్లూకోట్స్ పోలీసులు తప్పతాగిన యువకుడిని స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించి, సాధ్యపడక బాధితులను పిలిపించుకొని ఫిర్యాదు తీసుకున్నారు. సీఐ శివరాముడు బాధితులతో మాట్లాడి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. పట్టపగలు మహిళపై దాడి చేయడమే కాకుండా దుస్తులు కూడా చించేయడంతో బాధిత మహిళ పోలీసులకు ఎలాగైనా మాకు రక్షణ కల్పించాలని కోరింది. గతంలో కూడా ఇలాగే దాడి చేశాడని తెలిపింది. బాధితుల ఫిర్యాదు స్వీకరించిన సీఐ.. తాగుడుకు బానిసై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యువకుడిని కౌన్సెలింగ్ సెంటర్‌కు పంపాలని సూచించారు.

### విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం

**బుక్కరాయసముద్రం:** ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ డేటా సైన్స్ వారు ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా 7 రోజులుగా బీటెక్ విద్యార్థులకు 'గేమ్ డిజైన్ యూజింగ్ బిల్డ్ బాక్స్'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు చిత్రలింగప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.